సాక్షి
సూర్యాపేట
సోమవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2023



బలితీసుకున్న భూ వివాదం

పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన భూ వివాదం చివరకు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది.

- 8లో



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

అంతర్రాష్ట్ర దొంగను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.10లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



నృసింహుడి నిత్య కల్యాణం

మట్టపల్లి ఆలయంలో లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.

- 10లో

న్యూస్‌రీల్

గృహ కార్మికులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హస్సేన్

భానుపురి (సూర్యాపేట) : ఇండ్లలో పనిచేసే వారిని గృహ కార్మికులుగా గుర్తించాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ అన్నారు. ఆదివారం పట్టణంలో గృహ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాస అనసూయ అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహ కార్మికులకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గృహ కార్మికుల సంఘం పట్టణ అధ్యక్షురాలు స్వాతి, ఉపాధ్యక్షులు పద్మ, రేణుక సుహాసిని పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

సూర్యాపేటటౌన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష నిర్వహించారు. సూర్యాపేట, కోదాడ సెంటర్లలో జరిగిన పరీక్షకు మొత్తం 1000 మంది విద్యార్థులకు గాను 966 మంది విద్యార్థులు హాజరు కాగా 34 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డీఈఓ అశోక్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు రద్దు

- ఉమ్మడి జిల్లాలో పదవులు కోల్పోయిన ఎనిమిది మంది

నల్లగొండ: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని కార్పొరేషన్ పదవులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పదవులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ పదవుల్లో కొనసాగుతున్న ఎనిమిది మంది నేతల పదవులు రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, షీప్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ట్రైబల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రామచంద్రనాయక్, ఫుడ్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మేడి రాజీవ్‌సాగర్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పదవులు కోల్పోయారు. వీరితో పాటు పలువురు వైస్ చైర్మన్ల పదవులు కూడా రద్దయ్యాయి.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పాతసూర్యాపేట స్టేజ్ వద్దగల శ్రీసంతోషి రూపాదేవి ఫలవృక్ష క్షేత్రంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో కార్తీక వన సమారాధన ఎంతో విశేషమైందని తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తులసి, ఆమలక, యల్కపత్రీ పూజలు, శ్రీసంతోషి మాత పూజలు, శివలింగాకృతిలో దీపోత్సవం చేశారు. హనుమకొండ బ్రహ్మశ్రీ వంగల సోమయాజులుతో ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి సోమనరసయ్య, శ్రీసంతోషిమాత దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూకా వెంకటేశంగుప్త, బ్రాహండ్లపల్లి మురళీధర్, పులిగిళ్ల అర్జున్‌గుప్త, కౌన్సిలర్ వెలుగు వెంకన్నసంతోషి, కొత్త మల్లికార్జున్, బోనగిరి విజయ్‌కుమార్, గోపారపు రాజు, అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై ఆశలు

జిల్లా నుంచి ఇద్దరికి కీలక శాఖలు

- ఒకరు గతంలో ప్రాజెక్టులు మంజూరు చేయిస్తే.. మరొకరు ఇప్పుడు వాటిని పూర్తి చేసే మంత్రిగా బాధ్యతలు
- శ్రీశైలం సొరంగం పనుల్లో కదలిక వచ్చే అవకాశం
- బ్రాహ్మణ వెల్లెంల, ఎత్తిపోతల పథకాలకూ మంచి రోజులు



మన్నెవారిపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం



కొనసాగుతున్న వెల్లటూరు ఎత్తిపోతల పనులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కీలక శాఖలు కేటాయించడంతో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో పట్టుబట్టి ప్రాజెక్టులు మంజూరు చేయించుకున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి కావడం, జిల్లాకే చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖ ఇవ్వడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వారి నేతృత్వంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు మంచి రోజులు రానున్నాయని భావిస్తున్నారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని మంజూరు చేయించారు. అలాగే బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును మంజూరు చేయించిన ఘనత కోమటిరెడ్డిదే. ఈ రెండు ప్రాజెక్టులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైనవే. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగిన ఆ రెండు ప్రాజెక్టులతోపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నెల్లికల్, అయిటిపాముల సహా 15 ఎత్తిపోతల పథకాల పనుల్లో ఇప్పుడు వేగం పుంజుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

టన్నెల్ పనులు పుంజుకునేనా..

శ్రీశైలం బ్యాక్ వాటర్‌నుంచి సొరంగ మార్గం ద్వారా నల్లగొండ జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు 2007 దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒప్పించి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు మంజూరు చేయించారు. అప్పట్లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1925 కోట్లు కాగా, ప్రస్తుతం అది రూ. 4557 కోట్లకు చేరింది. అయితే అప్పటి నుంచి 2014 వరకు ఏడేళ్లలో వేగంగా సాగిన టన్నెల్ పనుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక జాప్యం చోటు చేసుకుంది. ఇందుకు ప్రభుత్వం ప్రాజెక్టు పట్ల కొంత అలసత్వం ప్రదర్శించడం ఒక కారణమైతే, టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) పాడైపోవడం, దానికి మరమ్మతులు చేయడంలో ఆలస్యం కావడం మరో కారణం. దీంతో ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. ఈ ప్రాజెక్టు పనులపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమారెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి కావడం, ఆ ప్రాజెక్టును మంజూరు చేయించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా రోడ్లు భవనాల శాఖ మంత్రి కావడంతో ప్రాజెక్టు పనులను వేగంగా చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఏడేళ్లలో 23 కిలో మీటర్లు.. 11.300 కిలోమీటర్లు

ప్రాజెక్టు మంజూరు చేసిన ఏడేళ్లలో అప్పటి ప్రభుత్వం వేగంగా పనులు చేపట్టింది. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ (ఇన్‌లెట్) నుంచి దోమలపెంట వద్ద పనులు చేపట్టగా, నల్లగొండ జిల్లా పరిధిలోని మన్నెవారిపల్లి వద్ద టన్నెల్ (ఔట్‌లెట్) పనులను ప్రారంభించారు. జిల్లాలో 43.930 కిలో మీటర్లు టన్నెల్ తవ్వాల్సి ఉంది. 2007లో పనులు ప్రారంభమైనప్పటి నుంచి 2014 మే నెల వరకు 23 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వితే, ఆ తరువాత నుంచి ఇప్పటివరకు తొమ్మిదిన్నరేళ్లలో 11.370 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకమే పూర్తయింది. మొత్తంగా ఇప్పటివరకు 34.37 కిలో మీటర్ల మేర టన్నెల్ పూర్తికాగా ఇంకా 9.56 కిలో మీటర్ల పొడవున టన్నెల్ తవ్వాల్సి ఉంది.తెలంగాణ ఏర్పడకముందు ప్రాజెక్టు వ్యయం రూ.1,925 కోట్లలో రూ.1,279 కోట్లు ఖర్చు చేయగా, తెలంగాణ వచ్చాక అప్పట్లో మంజూరు చేసిన రూ. 1432 కోట్లు కలిపి మొత్తంగా రూ.2,711 కోట్లు ఖర్చు చేసింది. అయినా టన్నెల్ పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. టన్నెల్ పూర్తి చేసేందుకు ఇంకా రూ. 1,846 కోట్ల అవసరం ఉంది.

ఏప్రిల్ నుంచే ఆగిపోయిన పనులు

టన్నెల్ తవ్వకంలో ప్రధానమైన టీబీఎంలో ఏర్పడిన సాంకేతిక లోపాలు, విద్యుత్ చార్జీలు, కార్మికుల బకాయిలు తదితర సమస్యతో గత ఏప్రిల్ నుంచే పనులు ఆగిపోయాయి. దానికి కావాల్సిన బేరింగ్‌లు జర్మనీ నుంచి తెప్పించాల్సి ఉండగా యంత్రాంగం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో జాప్యం జరుగుతోంది. దీంతో అందులో పనిచేస్తున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. సొరంగం పూర్తి చేసి నక్కలగండి ప్రాజెక్టును నింపితే దేవరకొండతో పాటు మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని 516 గ్రామాలకు తాగునీటిని అందించవచ్చు. జిల్లా మంత్రులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేస్తారని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

ఎత్తిపోతల పనుల్లో కదలిక వచ్చేనా



నాగార్జునసాగర్ జలాశయ తీరాన కొనసాగుతున్న నెల్లికల్లు ఎత్తిపోతల పనులు

సాగర్ ఉప ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో నెల్లికల్‌తోపాటు మరో 14 ఎత్తిపోతల పథకాలకు అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి నిధులను మంజూరు చేశారు.అయితే వాటి పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. 2021 ఫిబ్రవరిలో వాటికి శంకుస్థాపన చేసినా ఇంతవరకు సగం పనులు కూడా కాలేదు. పీఏపల్లి మండలంలోని పెద్దగట్టు ఎత్తిపోతలకు అనుమతులే రాకపోగా, పొగిళ్ల తదితర లిఫ్టుల పనులు ప్రారంభానికే నోచుకోలేదు. ఏకేబీఆర్ ఎత్తిపోతల, కంబాలపల్లి, చందంపేట మండలంలోని అంభాభవాని ఎత్తిపోతల పథకాలు, మిర్యాలగూడ పరిధిలో తోపుచర్ల, వీర్లపాలెం, కేశవాపురం, బొత్తల పాలెం, దున్న పోతులగండి, నకిరేకల్‌లో అయిటిపాముల ఎత్తిపోతల, పాలకవీడు మండలంలో జాన్‌పహాడ్ ఎత్తిపోతల, చింతలపాలెం మండలం వెల్లటూరు వద్ద లిఫ్ట్ చేసి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో ఎత్తిపోసే పథకం పనులు అలాగే ఉండిపోయాయి. మరోవైపు బస్వాపురం రిజర్వాయర్, కాలువల పనులు పూర్తి చేయడం, గోదావరి జలాలను కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో తీసుకువచ్చే కార్యాచరణపైనా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకుంటే పూర్తి కానున్న బ్రాహ్మణ వెల్లెంల

'నాకు మంత్రి పదవి వద్దు.. ప్రాజెక్టు కావాలి' అని పట్టుపట్టి 2007లో ఉదయం సముద్రం ఎత్తిపోతల పథకాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన స్వగ్రామమైన బ్రాహ్మణ వెల్లెంలలో రూ.699 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో పథకాన్ని ప్రారంభించారు. నార్కట్‌పల్లి, మునుగోడు, చిట్యాల, కట్టంగూరు, నల్లగొండ ఐదు మండలాల పరిధిలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఈ పథకాన్ని చేపట్టారు. 15 ఏళ్లు అవుతున్నా ఇంతవరకు ప్రాజెక్టును పూర్తి చేయలేదు. పడుతూ లేస్తూ 10 కిలోమీటర్ల పొడవున సొరంగం, రిజర్వాయర్, పంప్‌హౌస్, పవర్ స్టేషన్ వంటి పనులను పూర్తి చేశారు. కానీ ప్రధాన కాల్వల పనులు చేయలేదు. వాటికి సంబంధించిన భూసేకరణ పూర్తి కాలేదు.

డిండికి నీటి కేటాయింపుపైనా రాని స్పష్టత

జిల్లాలోని మునుగోడు, దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్‌లోని దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరందించే పాలమూరు రంగారెడ్డి అంతర్భాగంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుంచి నీటిని తీసుకోవాలనే దానిపై ఇంతవరకు స్పష్టత లేదు. కృష్ణా జలాల నీటి వాటాలు తేలకపోవడంతో ప్రాజెక్టు పరిస్థితి గందరగోళంగా మారింది. దానికింద నిర్మిస్తున్న సింగరాజుపల్లి (డిండి మండలం), గొట్టిముక్కల (దేవరకొండ మండలం), కిష్టరాయినిపల్లి, చింతపల్లి (చింతపల్లి మండలం), శివన్నగూడెం (మర్రిగూడ మండలం) రిజర్వాయర్లకు సంబంధించిన పరిహారం విషయంలో ఉన్న వివాదాలను పరిష్కరించాల్సి ఉంది. మరోవైపు నీటి కేటాయింపుపై స్పష్టత లేక వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అవినీతిపై విచారణ జరిపిస్తాం



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- విద్యుత్ శాఖ అప్పులపై మాజీమంత్రి జగదీష్‌రెడ్డి బాధ్యత వహించాలి
- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపిస్తుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా విద్యుత్ శాఖలో 85వేల కోట్ల అప్పులకు అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో ప్రభుత్వ స్థలాలు, నాలాల ఆక్రమణలపై కూడా విచారణ జరిపిస్తానన్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తానని, ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజులలో అమలు చేస్తామన్నారు. మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకంలో జరిగిన అవినీతిపై విచారణ ఉంటుందని, జగదీష్ రెడ్డి బంధువుల పాత్రపైనా విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, వీరన్ననాయక్, బైరు శైలేందర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సూర్యాపేటటౌన్ : సమగ్ర శిక్ష క్లస్టర్ రీసోర్స్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా కంచర్ల మహేందర్, కార్యదర్శిగా మామిడి సైదయ్యలను ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన క్లసర్ రీసోర్స్ పర్సన్ల సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కోశాధికారి, కార్యదర్శి మాట్లాడారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన సీఆర్‌పీలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మంత్రిగా కోమటిరెడ్డి బాధ్యతల స్వీకరణ



రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా సచివాలయంలోని చాంబర్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆశీర్వచనం ఇస్తున్న వేదపండితులు

12న కోదాడలో జిల్లా స్థాయి చెస్ సెలక్షన్స్

హుజూర్‌నగర్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కోదాడలోని తేజ విద్యాలయంలో ఈనెల 12న జిల్లా స్థాయి చెస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆజంబాబా, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 14నుంచి 17ఏళ్లలోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి నల్ల గొండ జిల్లా పోటీలకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పాఠశాల ధ్రువీకరణ పత్రంతోపాటు చెస్ బోర్డు, కాయిన్స్‌తో ఉదయం 9 గంటల లోపు హాజరు కావాలని తెలిపారు. ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9491329171 నంబరులో సంప్రదించాలని కోరారు.

స్వదేశీ పరిజ్ఞానంతోనే సాగర్‌డ్యాం నిర్మాణం



పైలాన్ పిల్లర్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న ఇంజనీర్లు

నాగార్జునసాగర్: ఆధునిక దేవాలయంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ డ్యాం స్వదేశీ పరిజ్ఞానంతోనే నిర్మాణమైందని ప్రాజెక్టు డీఎస్‌ఈ నాగేశ్వర్‌రావు అన్నారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసి 68సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పైలాన్ కాలనీలోని శంకుస్థాపన పిల్లర్ వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది కూలీలు, వందలాది మంది ఇంజనీరింగ్ నిపుణులు, కాంట్రాక్టర్లు ఒక యజ్ఞంలా భావించి రేయింబవళ్లు కష్టపడి 12 సంవత్సరాల్లో డ్యాం నిర్మాణం పూర్తి చేశారని పేర్కొన్నారు. వారి శ్రమ ఫలితంగానే నేడు రెండు తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందుతోందన్నారు. కార్యక్రమంలో డ్యాం ఈఈ మల్లి ఖార్జున్, డీఈలు సుదర్శన్, శ్రీనివాస్, జేఈ కృష్ణయ్య, ఏఈ సత్యనారాయణ, భిక్షమయ్య పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు గుర్తింపేదీ?

ఎంప్లాయీస్ ఐడీ లేక వర్తించని పేస్కేల్

- ఐదు మాసాలుగా గ్రామ రెవెన్యూ సహాయకులకు అందని వేతనాలు
- పూట గడవక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- నూతన ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



హుజూర్‌నగర్ : సమ్మెలో ఉన్న వీఆర్‌ఏలు (ఫైల్)

హుజూర్‌నగర్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటైన వీఆర్‌ఏలకు ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీరికి పేస్కేల్ వర్తింపజేస్తామని ప్రకటించి ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసింది. కానీ, వీఆర్‌ఏలకు ఉద్యోగ గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడంతో జీతాలు అందడం లేదు. అలాగే సమ్మె కాలం 80 రోజుల వేతనం కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం వారి కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

352మంది వీఆర్‌ఏలు పేస్కేల్ పోస్టులకు అర్హత

జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 442 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో 61ఏళ్లు పైబడిన, మరణించిన వారిని మినహాయిస్తే 352 మంది ఉన్నారు. విద్యార్హత, వయస్సు ప్రామాణికంగా వీరు పేస్కేల్ పోస్టులకు అర్హత సాధించారు. ఈ 352 మందిలో డిగ్రీ, పీజీ ఆపై విద్యావంతులైన 148 మంది, ఇంటర్–98, పదవ తరగతి వరకు చదివిన వారు 106 మంది ఉన్నారు. వారిలో పది వరకు చదివిన వారిని వివిధ శాఖల్లో హెల్పర్, లస్కర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో నియమించారు. ఇంటర్ చదివిన వారికి వివిధ శాఖల్లో రికార్డ్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇచ్చారు. డిగ్రీ ఆపై చదివిన వారికి ఆయా శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్‌లుగా పోస్టులను కేటాయించారు. వీరిలో 18 మంది రంగారెడ్డి జిల్లాకు జూనియర్ అసిస్టెంట్లుగా వెళ్లారు. 30 మంది జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. మిగిలిన వారు జిల్లాలో రెవెన్యూ శాఖ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులయ్యారు.

ఉద్యోగ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి



వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌ఏలకు ఉద్యోగ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. ఐదు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. జీతాలు రాకపోవడంతో వీఆర్‌ఏల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంది. సమ్మె కాలం నుంచి నేటి వరకు చనిపోయిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– నర్సింహారావు, రాష్ట్ర కో చైర్మన్, వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి, హుజూర్‌నగర్

ఎంప్లాయీస్ ఐడీ జారీ చేయకుండా..

వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వారికి పేస్కేలు అమలుకు సంబంధించిన ఆదేశాలను విడుదల చేయలేదు. ఫలితంగా వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల(వీఆర్‌ఏ)కు ఎంప్లాయీస్ ఐడీ జారీ చేయలేదు. ఉద్యోగ గుర్తింపు కార్డు ఆధారంగానే ఆర్థికశాఖ ద్వారా ఉద్యోగులకు వారి ఖాతాల్లో వేతన డబ్బులు జమ అవుతాయి. వీరికి ఎంప్లాయీస్ ఐడీ కేటాయించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా జీతాలు అందడం లేదని వీఆర్‌ఏలు వాపోతున్నారు. వీఆర్‌ఏలను విలీనం చేసిన సమయంలో సరైన విధి విధానాలను నిర్దేశించకపోవడంతో ఉద్యోగుల పరి స్థితి అయోమయంగా మారింది.నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా బకాయి వేతనాలు అందించాలని వీఆర్‌ఏలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు చోరీ

మోటకొండూర్: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైరు అపహరించారు. ఈ ఘటన మోటకొండూర్ మండలంలోని అమ్మనబోలు గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన సంగు నర్సిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ లైన్‌ను కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరును దొంగిలించారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన మర్యాల నరేష్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించాడు. అపహరణకు గురైన రాగి వైరు విలువ రూ.1.5లక్షలు ఉంటుందని ఏఈ వినోద్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఎలుకల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన సిరుగురి లింగస్వామి(46) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈ నెల 7వ తేదీన ఇంట్లో ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు అంతటి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో బైక్ చోరీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి రైల్వే స్టేషన్‌లో బైక్ చోరీకి గురైంది. వివరాలు.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన కామర్ల వెంకటేశ్వర్లు తిప్పర్తి రైల్వే స్టేషన్‌లో పాయింట్ మెన్‌గా పనిచేస్తున్నాడు. నవంబర్ 1వ తేదీన తిప్పర్తి రైల్వే స్టేషన్‌లో తన బైక్‌ను పార్కింగ్ చేసి డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి రైల్వే స్టేషన్‌లో తన బైక్ కనిపించలేదు. ఎక్కడ వెతికినా బైక్ ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామ పంచాయతీ మధిర అస్నోనిగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్నోనిగూడెం గ్రామానికి చెందిన యడ్ల పక్కీరు(42)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పక్కీరు వ్యవసాయంతో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన పక్కీరు భార్య సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

బీబీనగర్: బీబీనగర్ పెద్ద చెరువులో శనివారం గల్లంతైన యువకుడి మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పరిధిలోని చెంగిచెర్లలోని గణేష్‌నగర్‌కు చెందిన పండిపాటి మహేష్(27) మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన మహేష్ శనివారం బీబీనగర్ పెద్ద చెరువు వద్దకు చేరుకొని అందులో దూకాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి 'స్పెల్ బీ, మ్యాథ్స్ బీ'కి విశేష స్పందన

- సూర్యాపేటలోని జయ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్వార్టర్ ఫైనల్ పరీక్షలు

సూర్యాపేటటౌన్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన 'స్పెల్ బీ, మ్యాథ్స్ బీ' క్వార్టర్ ఫైనల్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ఈ స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నారు. ఈ పరీక్షలను నాలుగు కేటగిరీలలో నిర్వహించారు. కేటగిరీ–1లో 1, 2వ తరగతి విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతులు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాశారు. గత నెలలో స్పెల్ బీ పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థులు ఈ క్వార్టర్ ఫైనల్ పరీక్షలు రాశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడలోని జయ పాఠశాల విద్యార్థులతో పాటు కోదాడలోని తేజ పాఠశాల విద్యార్థులు, మిర్యాలగూడలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సాక్షి నల్లగొండ బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, సాక్షి నల్లగొండ డిప్యూటీ మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ జయ వేణుగోపాల్, బింగి జ్యోతి, జెల్లా పద్మ, ఎండీ ఖలీం, జయరాజన్, బ్రహ్మారెడ్డి, సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ అసిస్టెంట్ ఆఫీసర్ వేములకొండ జానయ్య, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్య, సూర్యాపేట టౌన్ రిపోర్టర్ మాదగాని వేణు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలోని జయ పాఠశాలలో స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

SAKSHI MATH BEE 2023-24 SAKSHI SPELL Bee 2023-24

గణితం సులభంగా నేర్చుకోవచ్చు



మ్యాథ్స్ బీ పరీక్ష వలన గణితం సులభంగా నేర్చుకోగలుగుతున్నాం. ఈ పరీక్ష రాయడం వలన గణితంలో పట్టు సాధిస్తున్నాం. మా స్కూల్ నుంచి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ క్వార్టర్ ఫైనల్ పరీక్షల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఎం. బ్రహ్మారెడ్డి, గణిత ఉపాధ్యాయుడు, తేజ విద్యాలయం, కోదాడ

ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం లభిస్తుంది



స్పెల్ బీ పరీక్షల వలన విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం లభిస్తుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయి. ప్రతి సంవత్సరం మా పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీలో పాల్గొంటే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.

– బింగి జ్యోతి, డైరెక్టర్, జయ పాఠశాల, సూర్యాపేట

స్పెల్ బీతో నైపుణ్యం పెరుగుతుంది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించే స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. విద్యార్థులకు నైపుణ్యం పెరుగుతుంది. చదువుతో పాటు ఆంగ్ల పదాల అర్థాలు కూడా నేర్చుకుంటున్నారు. ఆంగ్ల భాష భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– జయరాజన్, ప్రిన్సిపాల్, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, మిర్యాలగూడ

ఎనిమిదేళ్లుగా పాల్గొంటున్నాం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్షలో తమ పాఠశాల నుంచి గత ఎనిమిదేళ్లుగా పాల్గొంటున్నాం. ఇప్పటి వరకు నాలుగు సార్లు ఫైనల్‌కు వెళ్లాం. ఒకసారి రూ.25వేల నగదు బహుమతి, బంగారు పతకం తీసుకున్నాం. ఇలాంటి పరీక్ష నిర్వహిస్తున్న సాక్షి మీడియాకు ధన్యవాదాలు.

– ఎండీ. ఖలీం, ప్రిన్సిపాల్, వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ స్కూల్, మిర్యాలగూడ

రెండోసారి ఎంపికయ్యా



స్పెల్ బీ పరీక్ష రాయడం ద్వారా ఇంగ్లిష్ పదాలపై అవగాహన వస్తుంది. నేను స్పెల్ బీ లెవల్–2కు ఎంపిక కావడం ఇది రెండోసారి. ఈ పరీక్ష రాయడం చాలా సంతోషంగా ఉంది. ఈ పరీక్షలో నేర్చుకునే ఇంగ్లిష్ ఎంతగానో ఉపయోగపడతాయి.

– ధాత్రి కృష్ణ, 9వ తరగతి, జయ పాఠశాల, సూర్యాపేట

చాలా కొత్త పదాలు నేర్చుకున్నా



సాక్షి మీడియా నిర్వహించిన స్పెల్ బీ పరీక్ష మూడో సారి రాస్తున్నాను. మొదటి లెవల్‌కు సెలెక్టయ్యి రెండో లెవల్‌లో పరీక్ష రాశాను. మూడో లెవల్‌కు వెళ్తానని చాలా ధీమాగా ఉంది. ఈ స్పెల్ బీ వలన వెయ్యి పదాలు నేర్చుకున్నారు. చాలా ఉపయోగకరంగా ఉంది.

– నిహారిక శర్మ, 9వ తరగతి, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, మిర్యాలగూడ

తప్పులు లేకుండా రాస్తున్నా



సాక్షి స్పెల్ బీ పరీక్షను ఎంతో సంతోషంగా రాశా. ఈ పరీక్ష రాయడం ద్వారా ఇంగ్లిష్ పదాలు చాలా నేర్చుకున్నాను. అలాగే తప్పులు లేకుండా పదాలు రాయగలుగుతున్నాను. మూడో లెవల్‌కు కూడా సెలక్టవుతా. పరీక్ష చాలా బాగా రాశా.

– జి.హర్ష, 4వ తరగతి, వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ స్కూల్, మిర్యాలగూడ

ఒకరిని బలితీసుకున్న భూ వివాదం

- ఓ వర్గం ఫిర్యాదుతో మరో వర్గం వారిని ఠాణాకు రమ్మని పోలీసుల ఆదేశం
- రెండు రోజులు ఆలస్యం కావడంతో ఆగ్రహించిన ఎస్‌ఐ
- జులుం ప్రదర్శించడంతో ఒకరికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి
- అధిక రక్తపోటు.. ఆపై గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యుల నిర్ధారణ
- చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ.. ఎస్‌ఐని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

చింతపల్లి: పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన భూ వివాదం చివరకు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని పాలెం తండాకు చెందిన సేనావత్ సూర్య (56) హైదరాబాదులోని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడి తోడ మరో ముగ్గురు సోదరులు ఉన్నారు. స్వగ్రామంలో సూర్యా తల్లి పేరిట ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని సమానంగా పంచుకుని సాగు చేసుకుంటున్నారు. కాగా, సూర్యా హైదరాబాద్‌లో ఉంటుండగా అతడి తమ్ముడు భీమా కొంత అన్న భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఇదే విషయంపై సూర్యా అతడి తమ్ముడు భీమా మధ్య చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి.

అప్పుకు భూమికి లింక్ పెట్టి..

సూర్యా కుమారుడు కిరణ్ తరచూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో బాబాయి భీమా వద్ద కిరణ్ అవసరాల నిమిత్తం రూ. 3లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తిరిగి చెల్లించాలని భీమా కోరడంతో తమ భూమిని కొంత పట్టా చేయించుకున్నావని, ఆ సమస్య పరిష్కారం అయితేనే అప్పు డబ్బులు చెల్లిస్తామని సూర్యా అతడి కుమారుడు కిరణ్ తేల్చిచెప్పారు. విషయం పెద్ద మనుషుల వద్దకు చేరడంతో రెండు నెలల క్రితం భీమా తన పేరిట అధికంగా ఉన్న పట్టా భూమిని సోదరుడు సూర్యాపై ఎక్కించాడు.

డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదు

భీమా తన పేరిట అధికంగా ఉన్న భూమిని సూర్యా పేరిట పట్టా చేయించిన తిరిగి అప్పు చెల్లించలేదు. దీంతో విసిగిపోయిన భీమా శుక్రవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి అప్పు తిరిగి ఇవ్వడంతో తాత్సారం చేస్తున్న సూర్య, అతడి కుమారుడిని పిలిపించాలని అదే రోజు సిబ్బందిని ఆదేశించాడు. దీంతో వారు సూర్యకు ఫోన్ చేసి ఠాణాకు రావాలని హుకుం జారీ చేశారు.



సూర్య మృతదేహం

రెండు రోజుల తర్వాత వచ్చారని..

సూర్య, అతడి కుమారుడు కిరణ్ ఆదివారం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం తిరిగి విధులకు హాజరైన ఎస్‌ఐ స్టేషన్‌కు రావాలని ఫోన్ చేస్తే రెండు రోజుల తర్వాత వస్తారా అంటూ వారిపై కోపంతో చేయిచేసుకున్నాడు. దీంతో సూర్యా అస్వస్థతకు గురై వాంతి చేసుకున్నాడు. వెంటనే పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు సూర్యను దేవరకొండ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా కుప్పకూలి మృతిచెందాడు. ఎస్‌ఐ చేయి చేసుకోవడంతోనే సూర్య మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులకు వాగ్వాదం జరిగింది. మృతదేహాన్ని చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అడ్డుకుని దేవరకొండ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే, సూర్యకు బీపీ పెరిగి గుండెపోటుతో మృతిచెందాడని దేవరకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్‌ను నల్లగొండ ఎస్పీ అపూర్వరావు సందర్శించారు. ఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతపల్లి ఎస్‌ఐని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన మంజుల హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంజులతో సఖ్యతగా మెలిగిన నల్లగొండ పట్టణంలోని హైదర్‌ఖాన్‌గూడకు చెందిన వాజిద్ తనను దూరం పెడుతుందన్న కారణంతోనే ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. నిందితుడిని ఆదివారం నల్లగొండ పట్టణంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శాలిగౌరారం సీఐ ఎస్. రాఘవరావు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.10లక్షల విలువైన సొత్తు రికవరీ



నిందితుడు శ్రీకాంత్‌రాజు

భూదాన్‌పోచంపల్లి : అంతర్రాష్ట్ర దొంగను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.10లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు విక్రమ్‌రెడ్డి, దోసపాటి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాడోజు శ్రీకాంత్‌రాజు(46) అలియాస్ రాజు అలియాస్ నాగరాజు కొంతకాలంగా హైదరాబాద్‌లోని హబ్సిగూడ, రవీంద్రనగర్‌లో నివాసం ఉంటూ కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీకాంత్‌రాజు మద్యానికి బానిసై తెలిసిన చోటల్లా అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు.

వృద్ధులే టార్గెట్‌గా..

మద్యం, చెడు వ్యవసాలను బానిసైన శ్రీకాంత్‌రాజు ఇటీవల వృద్ధులను టార్గెట్ చేశాడు. మాయమాటలతో వృద్ధులను బురిడీ కొట్టించి వారి వద్ద నుంచి సొత్తును కాజేయాలని పన్నాగం పన్నాడు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీన శ్రీకాంత్‌రాజు కారులో భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి వచ్చాడు. గ్రామశివారులో కారును పార్కింగ్ చేసి అటుగా వెళ్తున్న మాజీ సర్పంచ్ రాపోలు రామచంద్రంను ఆపి తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తానని, తనకు వ్యవసాయ భూమి కావాలని, ఉంటే చూపించమని కోరాడు. దీంతో అతను తనకు తెలిసిన భూమిని చూపించేందుకు స్కూటీపై గ్రామ శివారులో ఉన్న ఓ భూమిని చూపించాడు. అయితే ఆ సమయంలో వృద్ధుడైన రామచంద్రం ఒంటరిగా ఉండటంతో వెంటనే అతడిపై పెద్ద బండరాయి ఎత్తి చంపేస్తానని బెదిరించి అతని వద్ద ఉన్న బంగారు గొలుసు, చేతికి ఉన్న మూడు బంగారు ఉంగరాలను తీసుకొని అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అడ్రస్ తెలుసుకొని ఆదివారం అతడిని హైదరాబాద్‌లోని హబ్సిగూడలో పట్టుకొని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 5 తులాల బంగారు గొలుసు, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడిని భువనగిరి కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలి పారు. నిందితుడిపై నేరడుచర్ల, నాగారం, నేలకొండపల్లి, మోత్కూరు, కోదాడ, తొర్రూర్, మద్రిపెడ, మునగాల, మహేశ్వరం, చాదర్‌ఘాట్, వలిగొండ, చౌటుప్పల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఉంగుటూరు, నందిగామ, తొండంగి, బొమ్మూరు, రంగంపేట, ఆనందపురం పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్‌ఐలు విక్రమ్‌రెడ్డి, సురేశ్, పోలీస్ సిబ్బంది వెంకన్న, కిరణ్‌కుమార్, గోపిని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య అభినందించారు.



నిందితుడి నుంచి రికవరీ చేసుకున్న సొత్తు

రహదారులకు మహర్దశ !

- నాలుగు లేన్లుగా ముశంపల్లి – ధర్మాపురం రోడ్డు
- రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటన
- తొలి సంతకం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- వారంలోగా టెండర్లు పిలవాలని అధికారులకు ఆదేశం

నల్లగొండ రూరల్: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రహదారులకు మహర్దశ పట్టనుంది. నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు–భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన వెంటనే నల్లగొండ నుంచి ముశంపల్లి–ధర్మాపురం వెళ్లే 18 కిలోమీటర్ల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు తొలి ఫైల్‌పై సంతకం చేశారు. వారం రోజుల్లోగా టెండర్లు పిలిచి యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలోని ఇతర రోడ్లు అభివృద్ధికి నోచుకోనుండడంతో ఇంత కాలం నరకయాతన అనుభవించిన జిల్లా ప్రజలు, వాహనదారులకు ఊరట లభించనుంది.

నాలుగు లేన్లుగా నిర్మాణం

ప్రస్తుతం సింగిల్‌గా ఉన్న నల్లగొండ–ముశం పల్లి–ధర్మాపురం రోడ్డు దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోక అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మీదుగా జిల్లా కేంద్రానికి వచ్చే నిడమనూరు, కనగల్, నల్లగొండ, మాడ్గులపల్లి మండలాలకు చెందిన రైతులు, ప్రజలు, విద్యార్థులు ప్రతిరోజూ నానా ఇబ్బందులు పడేవారు. మార్కెట్‌కు ధాన్యం తరలించాలన్నా రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. ఈ విషయాన్ని ఇటీవల ఎన్నికల ప్రచారం సమయంలో గుర్తించిన కోమటిరెడ్డి ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు పూనుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి ముశంపల్లి, ధర్మాపురం రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా మొత్తంగా 50 గ్రామాల ప్రజలకు రోడ్డు మార్గం సులభతరం కానుంది. దీంతో సాగర్, నల్లగొండ నియోజక వర్గ ప్రజలకు ప్రయాణం సులభతరం కానుండడంతోపాటు ఇక్కడి రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను హైదరాబాద్‌కు తరలించేందుకు సులువు కానుంది.



అధ్వానంగా ఉన్న ముశంపల్లి-ధర్మాపురం రోడ్డు

తొలి విడతలో అభివృద్ధి చెందే రోడ్లు ఇవే..

రోడ్లు– భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డి తొలి విడతలో నల్లగొండ–ముశంపల్లి–ధర్మాపురం రోడ్డుకు రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నల్లగొండ నుంచి మల్లేపల్లి వరకు, రీజినల్ రింగ్ రోడ్డు సౌత్–చౌటుప్పల్ రోడ్డు, ఆరు లేన్ల రోడ్డుగా హైదరాబాద్–విజయవాడ హైవేలు విస్తరించేందుకు యోచన చేస్తోన్నట్లు తెలిసింది. అలాగే నల్లగొండ పట్టణ పరిధిలో మిగిలి ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు నకిరేకల్–నాగార్జునసాగర్ రోడ్డు అభివృద్ధి పనులను కొనసాగిస్తారు.

మూడు జిల్లాల్లో ఇలా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3,621.391 కిలోమీటర్ల పొడవునా రోడ్లు ఉన్నాయి. వీటిలో ఒక్క నల్లగొండ జిల్లాలో 1,836.43 కి.మీ. సూర్యాపేట జిల్లాలో 907.598 కి.మీ యాదాద్రి భువనగిరి జిల్లాలో 877.363 కి.మీ. మేర రోడ్లు విస్తరించి ఉన్నాయి. జిల్లాకు చెందిన కోమటిరెడి వెంకట్‌రెడ్డి రోడ్లు–భవనాల శాఖ మంత్రి కావడంతో ఏడాది, రెండేళ్లలో ఈ రోడ్లన్నీ కొత్త రూపును సంతరించుకోనున్నాయి. సింగిల్ రోడ్లు డబుల్ రోడ్లుగా, డబుల్ రోడ్లు నాలుగులేన్లుగా విస్తరణ జరిగి ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయి. ఫలితంగా వ్యాపారం, వ్యవసాయం మరింత అభివృద్ధి చెందనుందని ప్రజలు భావిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సింగిల్ రోడ్డుగా ఉన్న నల్లగొండ–ధర్మాపురం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేందుకు తొలి సంతకం చేయడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన అద్దంకి దయాకర్

శాలిగౌరారం: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అద్దంకి దయాకర్

మృతదేహంతో ఆందోళన

కేతేపల్లి: తమకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు ఇవ్వకపోవడంతోనే తమ తండ్రి అనారోగ్యం పాలై మృతిచెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ ఘటన కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొర్లపహాడ్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి ఉపేందర్‌రావు తక్కువ ధరకు భూమి ఇప్పిస్తానని చెప్పి అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బయ్య భిక్షమయ్యయాదవ్ నుంచి 2017లో రూ.70లక్షలు తీసుకున్నాడు. ఏళ్లు గడుస్తున్నా ఉపేందర్‌రావు భిక్షమయ్యకు భూమి ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు కూడా ఇవ్వడం లేదు. దీంతో భిక్షమయ్య గ్రామ పెద్దలను ఆశ్రయించాడు. కాగా మూడేళ్ల క్రితం ఉపేందర్‌రావు తన కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఐదెకరాల భూమిని భిక్షమయ్యకు రిజిస్ట్రేషన్ చేస్తానని పెద్ద మనుషుల సమక్షంలో హామీ ఇచ్చాడు. రిజిస్ట్రేషన్ చేసేంత వరకు ఆ భూమిని భిక్షమయ్య సాగు చేసుకునేందుకు కూడా ఉపేందర్‌రావు అంగీకరించాడు. మూడేళ్లవుతున్నా ఉపేందర్‌రావు భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోగా.. కొంతకాలంగా కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. లక్షల రూపాయల డబ్బులు పోవటంతో పాటు భూమి కూడా రాకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన భిక్షమయ్య అనారోగ్యం బారిన పడ్డాడు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన భిక్షమయ్యను కుటుంబ సభ్యులు సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా శనివారం రాత్రి మృతిచెందాడు. భిక్షమయ్య మృతిచెందిన విషయాన్ని గ్రామస్తులు ఉపేందర్‌రావుకు తెలియజేసి గ్రామానికి రావాలని కోరారు. తాను అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరానని, రాలేనంటూ చెప్పాడు. ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు ఆదివారం భిక్షమయ్య మృతదేహాన్ని గ్రామంలో తాళం వేసి ఉన్న ఉపేందర్‌రావు ఇంటి ఆవరణలో ఉంచి అక్కడే మృతదేహాన్ని ఖననం చేస్తామంటూ గుంత తవ్వారు. విషయం తెలుసుకున్న కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్ద మనుషులతో చర్చలు జరిపారు. ఉపేందర్‌రావు గ్రామానికి తీసుకువచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకెళ్లారు.

మంత్రికి శుభాకాంక్షలు









ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ మంత్రిగా సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరేశం, బాలునాయక్, సామేల్, రాజగోపాల్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి